# ఆ 11.. అవకాశాలు మెండు

- నిపుణుల కొరత తీర్చే ఇంజినీరింగ్ కోర్సులతో యువతకు ఉద్యోగ అవకాశాలు
- నానో, డిఫెన్స్ టెక్నాలజీలు, ఏరోస్పేస్ వంటి బ్రాంచీల్లో అదనపు సీట్ల కేటాయింపుతో మేలు
- ఏఐసీటీఈకి రాష్ట్ర ప్రభుత్వం నివేదిక

ఈనాడు, హైదరాబాద్: దేశంలో ప్రస్తుతం 11 రంగాల్లో నిపుణుల కొరత ఉందని.. వాటిలో ఇంజినీరింగ్ కోర్సులను ప్రవేశపెడితే యువతకు పెద్దఎత్తున ఉద్యోగావకాశాలు కల్పించవచ్చని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. నానో టెక్నాలజీ - సెమీకండక్టర్లు, ఏరోస్పేస్, డిఫెన్స్ టెక్నాలజీ, క్లైమేట్ ఇంజినీరింగ్, బయోటెక్నాలజీ, కృత్రిమ మేధ (ఏఐ)-రోబోటిక్స్, డ్రోన్ టెక్నాలజీ వంటి డిమాండ్ ఉన్న 11 రంగాలను గుర్తించామని.. వాటికి సంబంధించిన కోర్సుల్లో అధిక బీటెక్ సీట్లు ఉండేలా ప్రోత్సహించాలని ...మిగతా 2లో



# ఆ 11.. అవకాశాలు మెండు!

(మొదటి పేజీ తరువాయి)

అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ)కి సూచించింది. ఈ కోర్సులను ప్రస్తుతం కొన్ని కళాశాలలే అందిస్తున్నాయని, వాటికి ఉద్యోగావకాశాలు ఎక్కువ ఉండటం వల్ల విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకోవాలని కోరింది. గుర్తించిన 11 రంగాల్లో ఆయా కళాశాలలకు అదనపు సీట్లు మంజూరు చేయవచ్చని పేర్కొంది. ఈ కోర్సులను బోధించేందుకు పరిశ్రమలకు చెందిన నిపుణులను నియమించుకోవాలని సూచించింది. సిలబస్ తయారీలోనూ పరిశ్రమల ప్రతినిధులను భాగస్వాములను చేయాలని కోరింది. కోర్సుల కోసం, నిపుణులతయారీకి ఈ రంగాలపై పనిచేసే పరిశ్రమలు, ప్రభుత్వసంస్థల భాగస్వామ్యంతో ప్రత్యేకంగా 'స్టేట్ ఆఫ్ ఆర్ట్ రీసెర్చ్‌ల్యాబ్'లు లేదా 'సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్'లను నెలకొల్పాలని సూచించింది. ఈ కోర్సులను ప్రవేశపెట్టిన కళాశాలల్లో నవకల్పన, ఇంక్యుబేషన్, స్టార్టప్‌లను ప్రోత్సహించాలని పేర్కొంది. ఈ మేరకు ఏఐసీటీఈకి నివేదిక సమర్పించింది. ఆయా రంగాల గురించి వివరించింది.

## 'ఎన్‌వోసీ'కి 5 కొలమానాలు

ఇకనుంచి అదనపు సీట్లకు, కొత్త కోర్సుల మంజూరుకు 5 కొలమానాలను పరిగణనలోకి తీసుకొని ఎన్‌వోసీ జారీచేస్తామని రాష్ట్ర విద్యాశాఖ తెలిపింది. ప్రస్తుతం ఉన్న కోర్సుల్లో విద్యార్థుల ప్రవేశాలు; కళాశాల ట్రాక్‌రికార్డు, మౌలిక వసతులు, అధ్యాపకులు; ప్రాంగణ నియామకాలు-పరిశ్రమలతో ఒప్పందాలు; ఎన్‌బీఏ, న్యాక్ అక్రిడిటేషన్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్; కొత్త కళాశాలలు, కోర్సులు, సీట్లపై రాష్ట్ర ప్రభుత్వ విధానం.. వీటిని ప్రాతిపదికగా నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది.

## డిమాండ్ ఉన్న రంగాలు..

**1. నానో టెక్నాలజీ–సెమీకండక్టర్స్:** ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్, టెక్స్‌టైల్స్, మెడిసిన్ పరిశ్రమల్లో నానోటెక్నాలజీ, సెమీకండక్టర్లకు డిమాండ్ ఉంది. ఎక్కువ కాలం మన్నే నిర్మాణ మెటీరియల్, క్యాన్సర్ చికిత్స, టీకాలు, హైడ్రోజన్ ఫ్యూయల్‌సెల్స్, నానోగ్రాఫిన్ బ్యాటరీలు వంటివాటిపై దృష్టిపెట్టాలి.

**2. ఏరోస్పేస్ ఇంజనీరింగ్, స్పేస్ టెక్నాలజీస్:** అంతరిక్ష ఆర్థికవ్యవస్థ గణనీయంగా వృద్ధి చెందుతోంది. శాటిలైట్ కమ్యూనికేషన్స్, రక్షణ రంగం, ప్రైవేట్ స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్‌లో డిమాండ్ ఉంది.

**3. డిఫెన్స్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ:** దేశాల మధ్య జియోపొలిటికల్ వివాదాల కారణంగా రక్షణ రంగంలో నిపుణులకు డిమాండ్ బాగా పెరగనుంది. స్మార్ట్ వెపన్ సిస్టమ్స్, మిలిటరీ గ్రేడ్‌ఏ1, డ్రోన్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సిస్టమ్స్ విభాగాలపై దృష్టి సారించాలి.

**4. క్లైమేట్ ఇంజినీరింగ్, సస్టెయినబుల్ టెక్నాలజీస్:** కాలుష్యరహిత ప్రపంచం దిశగా పరిస్థితులు మారుతున్నందున రెన్యువబుల్ ఎనర్జీ, కార్బన్ క్యాప్చర్, గ్రీన్ హైడ్రోజన్ టెక్నాలజీస్ తదితర విభాగాలపై ఫోకస్ పెట్టాలి.

**5. బయోటెక్నాలజీ, జినోమ్ ఇంజినీరింగ్:** వైద్య ఆరోగ్య రంగంలో సవాళ్లు, ఆహారభద్రత సమస్యలు పెరుగుతున్నందున బయోటెక్నాలజీ అవసరం మరింత పెరిగింది. సింథటిక్ బయాలజీ, అగ్రికల్చర్ బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్ తదితర అంశాలపై దృష్టి సారించాలి.

**6. ఏఐ, రోబోటిక్స్, డ్రోన్ టెక్నాలజీ:** పరిశ్రమలు ఆటోమేషన్ అవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో 3డీ ప్రింటింగ్ టెక్నాలజీ, ఏఆర్ అండ్ వీఆర్, కాగ్నిటివ్ రోబోటిక్స్ తదితర వాటిల్లో కోర్సులు అవసరం.

**7. మెరైన్ అండ్ ఓషన్ ఇంజినీరింగ్:** సముద్ర వనరులు, రెన్యువబుల్ విద్యుత్తుపై దృష్టి పెరిగినందున నీటి కింద అన్వేషణ, మెరైన్ రోబోటిక్స్, సముద్రాలను సంరక్షించుకునే సాంకేతికత తదితర అంశాలకు డిమాండ్ అధికమవుతోంది.

**8. క్వాంటమ్ కంప్యూటింగ్, టెక్నాలజీస్:** డేటాసెక్యూరిటీ, డేటాఎనాలిసిస్‌కు డిమాండ్ ఉన్నందున క్వాంటమ్ క్రిప్టోగ్రఫీ, క్వాంటమ్ సెన్సింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్ సిస్టమ్స్‌లో కోర్సులను ప్రవేశపెట్టాలి.

**9. ఫుడ్ టెక్నాలజీ, అగ్రిటెక్:** ప్రపంచవ్యాప్తంగా సుస్థిర ఆహార ఉత్పత్తి అవసరం పెరుగుతోంది. స్మార్ట్‌ఫార్మింగ్, ఫుడ్‌సెక్యూరిటీ, ఆల్టర్నేటివ్ ప్రోటీన్లు, అగ్రికల్చరల్ డ్రోన్లు వంటివాటిలో పెద్దఎత్తున నిపుణులు అవసరం.

**10. హెల్త్‌కేర్ టెక్నాలజీ, డిజిటల్ హెల్త్:** మారుమూల ప్రాంతాల్లో ఉన్న రోగులను సైతం పర్యవేక్షించేందుకు వైద్యరంగం కూడా డిజిటల్ రూపంలోకి మారుతోంది. టెలిమెడిసిన్ ప్లాట్‌ఫామ్స్, ఏఐ డయాగ్నస్టిక్స్, హెల్త్‌కేర్ రోబోటిక్స్, ధరించేందుకు వీలున్న వైద్య పరికరాలు వంటివాటికి డిమాండ్ పెరుగుతోంది. ఆసుపత్రులు, హెల్త్-టెక్ స్టార్టప్స్, 3డీ ప్రింటింగ్ ద్వారా బయోమెడికల్ ఇంప్లాంట్స్ తయారీ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోవచ్చు.

**11. అర్బన్ ఇన్‌ఫ్రా, స్మార్ట్ సిటీస్:** పట్టణీకరణ పెరుగుతున్నందున ఐఓటీ స్మార్ట్‌సిస్టమ్స్, రెన్యువబుల్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ పరిష్కారాలు వంటివాటికి అత్యధిక డిమాండ్ ఉంది.



హైదరాబాద్ జిల్లా వార్తలు.. వే2న్యూస్‌లో డౌన్లోడ్ way2news way2.co/872uxb

**యూనివర్సిటీ హాస్టల్‌లో ఇంచార్జ్ VC తనిఖీలు**

JNTU యూనివర్సిటీలోని హాస్టల్‌లో ఇన్చార్జి VC ప్రొ. బాలకిష్ట రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ జీవి నరసింహారెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. వరుసగా విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వస్తుండడంతో సమస్యలను తెలుసుకునేందుకు స్వయంగా వారితో కలిసి భోజనం చేశారు. మంజీరా, కిన్నెర, కృష్ణ, గౌతమి హాస్టల్స్ నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

10:03 PM,11th Jan 2025

టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక

## జెఎన్‌టియు యూనివర్సిటి హాస్టల్స్‌లో ఆకస్మిక తనిఖీలు



**విద్యార్థుల సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలి..**

**వైస్ ఛాన్సలర్ డా. వి. బాలకిష్టారెడ్డి**

టైమ్స్ ఆఫ్ వార్త – కూకట్ పల్లి

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. వి. బాలకిష్టారెడ్డి, రిజిస్ట్రార్ కె. వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డా. జి.వి. నరసింహారెడ్డి యూనివర్సిటీ హాస్టల్స్‌పై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మంజీర, కిన్నెర, కృష్ణ, గౌతమి బాయ్స్ హాస్టల్స్‌ను సందర్శించి విద్యార్థులతో కలసి భోజనం చేశారు.విద్యార్థుల సమస్యలను తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పర్యావరణాన్ని కాపాడుకోవాలనే సందేశాన్ని విద్యార్థులకు ఇచ్చారు. గౌతమి హాస్టల్ సెల్లార్‌ను వాహనాల పార్కింగ్ కోసం వినియోగించాలని విద్యార్థుల విజ్ఞప్తి: విద్యార్థుల అభ్యర్థన మేరకు తక్షణమే స్పందించిన అధికారులు,గౌతమి హాస్టల్ సెల్లార్‌ను వాహనాల పార్కింగ్‌గా వినియోగించుకోవడానికి ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు యూనివర్సిటీతో సంబంధిత ఏవైనా సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని, వాటికి తక్షణ పరిష్కారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వైస్ ఛాన్సలర్ తెలిపారు.

SUNDAY Page 6 12 Jan 2025
https://epaper.timesofvartha.com/clip/32290

## హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- జేఎన్టీయూ హెచ్ వైస్ ఛాన్సలర్ డా. వి. బాలకిష్టారెడ్డి
- యూనివర్సిటీ హాస్టల్స్‌పై ఆకస్మిక తనిఖీలు జెఎన్‌టియుహెచ్ ఉన్నతాధికారులు
- విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు

**కూకట్‌పల్లి, జనవరి 11, (నవభూమి ప్రతినిధి) :** హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. వి. బాలకిష్టారెడ్డి అన్నారు. శనివారం జేఎన్టీయూ హెచ్ హాస్టల్స్‌లో ఆయనతో పాటు రిజిస్ట్రార్ కె. వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డా. జి.వి. నరసింహారెడ్డి యూనివర్సిటీ హాస్టల్స్‌పై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం మంజీర, కిన్నెర, కృష్ణ, గౌతమి బాయ్స్ హాస్టల్స్ ను సందర్శించి విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. పర్యావరణాన్ని కాపాడుకోవాలనే సందేశాన్ని విద్యార్థులకు ఇచ్చారు. గౌతమి హాస్టల్ సెల్లార్‌ను వాహనాల పార్కింగ్ కోసం వినియోగించాలని విద్యార్థుల విజ్ఞప్తి చేశారు. గౌతమి హాస్టల్ సెల్లార్‌ను వాహనాల పార్కింగ్‌గా వినియోగించుకోవడానికి ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు యూనివర్సిటీతో సంబంధిత ఏవైనా సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని, వాటికి తక్షణ పరిష్కారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వైస్ ఛాన్సలర్ తెలిపారు.





నవభూమి epaper.navabhoomi.in
12 Jan 2025 - Page 9